క్లుప్తంగా

విధి నిర్వహణలో భద్రతే ప్రథమం



ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు

జ్యోతినగర్: విధి నిర్వహణలో భద్రతతో కూడిన రక్షణ చర్యలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఏజీఎం ఉమేశ్‌కుమార్ అన్నారు. సోమవారం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో కాంట్రాక్టు కార్మికులకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. విధులు నిర్వహించే సమయంలో సేఫ్టీ చర్యలు పాటించాలన్నారు. రక్షణపై ప్రతిజ్ఞ చేయించారు.

సీఎం సభకు తరలిన నాయకులు



సుల్తానాబాద్: పట్టణంలోని పలు కాలనీల నుంచి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు తరలివెళ్లారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా కరీంనగర్‌లో నిర్వహించే బహిరంగ సభకు తరలివెళ్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

సన్మానం



సుల్తానాబాద్: ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దివ్యదర్శన్‌రావును ఎంపీడీవో రిటైర్డ్ సూపరింటెండెంట్ అల్లంకి లింగమూర్తి ఘనంగా సన్మానించారు. సుల్తానాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, ఈజీఎస్ స్టాఫ్ వేరువేరుగా ఘనంగా సన్మానం చేశారు. ఎంపీవో సమ్మిరెడ్డి, సాదిక్ పాషా, ఏపీవో మల్లీశ్వరి ఉన్నారు.

జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, కాంగ్రెస్ యువ నాయకుడు శ్రీనుబాబు పుట్టిన రోజు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంథని డివిజన్‌లోని ఆయా మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. మంథని అంబేడ్కర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మంథనిలోని సామాజిక వైద్యశాలలో ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దేవాలయాల్లో పూజలు, అన్నదానం నిర్వహించారు.

బ్రాస్‌బ్యాండ్ యూనియన్ అధ్యక్షుడిగా తిరుపతిగౌడ్



తిరుపతిగౌడ్, మల్లేశం

ఎలిగేడు: బ్రాస్‌బ్యాండ్ వర్కర్స్ యూనియన్ మండల సమావేశం సోమవారం జిల్లా అధ్యక్షుడు రాజయ్య అధ్యక్షతన జరిగింది. మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలుసాని తిరుపతిగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గుజ్జుల నంబయ్య, ఉపాధ్యక్షులుగా కవ్వంపల్లి నరేశ్, ఈద కొమురయ్య, కార్యదర్శిగా దూట మల్లేశం, సహాయ కార్యదర్శులుగా గొల్లె లక్ష్మణ్, నేరెళ్ల సది, కోశాధికారిగా ఎండీ రజ్జబ్‌అలీ ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ సాహెబ్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్: జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందించారు. పోగుల విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి వల్లాల జగన్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. జర్నలిస్టులకు కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టి, ఉద్యోగుల మాదిరిగా ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యేలా కృషి చేయాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుంక మహేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణి సుదర్శన్, నాయకులు ఇరుకుల్ల వీరేశం, సాబీర్ పాషా, సబ్బు సతీశ్, చొప్పరి సుమన్, పూసాల రవి, జంగపల్లి సాగర్, సల్పాల ప్రశాంత్, శ్రీనివాస్, శోభన్, ప్రభాకర్ స్వామి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి పట్నాలు



జూలపల్లి: పెద్దాపూర్ శ్రీమల్లికార్జునస్వామి పట్నాలు, బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి లగ్న పట్నం కన్నుల పండువగా నిర్వహించారు. స్థానిక యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో ఒగ్గు పూజారులు మల్లికార్జునస్వామి నామస్మరణతో పట్నం వేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఒగ్గు పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబు



యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలోని విశ్వకర్మ శివాలయాన్ని మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. ఈనెల 26న జరిగే మహాశివరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగులమల్యాల రాజమౌళి తెలిపారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు.

ఆలయంలో రుద్రాభిషేకం



జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉద్దండ నవీన్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ పునర్ నిర్మాణ దాత నల్ల మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, ఆలయ ధర్మకర్తలు పొట్యాల మల్లేశం, వజ్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షల తేదీలు వచ్చేశాయి..



ఇంటర్ విద్యార్థులు

సుల్తానాబాద్: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదివే విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్లు ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఎంట్రెన్స్‌ల వారీగా తేదీలను ప్రకటిస్తూ ఆయా యూనివర్సిటీలు నిర్వహించేలా చర్యలు చేపట్టింది.

మల్టీపుల్ ప్రశ్నలు అధికం

- ప్రవేశ పరీక్షల్లో ఎక్కువ శాతం మల్టీపుల్ ప్రశ్నలు అధికంగా అడిగే అవకాశం ఉంటుంది. నీట్ ప్రవేశ పరీక్షలో కెమిస్ట్రీ, ఫిజిక్స్‌తోపాటు బయాలజీ, జువాలజీ విద్యార్థులు పట్టు సాధించాలి.
- లాసెట్ జనరల్ నాలెడ్జ్‌తోపాటు పొలిటికల్ సైన్స్, హిస్టరీపై అవగాహన ఉండాలి.
- బీఈడీ ఎంట్రెన్స్ రాసేవారికి, సైన్స్ గ్రూపువారికి సైన్స్, ఆర్ట్స్ గ్రూపువారికి ఆర్ట్స్ సబ్జెక్టులతోపాటు జనరల్ నాలెడ్జి అవసరముంటుంది.
- ఇంటర్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పాఠ్యాంశాలు బైపీసీ, ఎంపీసీ వారికి వేరువేరుగా ఎంసెట్ నిర్వహించనున్నారు.
- ఐసెట్ డిగ్రీ తర్వాత ప్రత్యేకంగా పీజీ చేసేవారు ఎంబీఏ, ఎంసీఏ కోర్సు, పీజీల్లో వివిధ రకాల సబ్జెక్టులవారీగా ఎంట్రన్సులు రాయాల్సి ఉంటుంది.
- వ్యాయామ ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా బీపీడీ కోర్సులు చేయాల్సి ఉంటుంది.
- ఎంట్రెన్స్‌లకు సన్నద్ధమయ్యే విద్యార్థులు నాలుగైదు సంవత్సరాలుగా వచ్చిన ప్రశ్నలు, జవాబులను తప్పనిసరిగా చూసుకోవాల్సి ఉంటుంది.

ఇవి చేయాలి..

పలు రకాల ఎంట్రెన్స్ రాసేవారు తప్పనిసరిగా తోటి విద్యార్థులతో సబ్జెక్టులవారీగా విచారించుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఉదయం 5 గంటలకే నిద్ర లేచి అల్పాహారాన్ని తీసుకోవాలి. 6 గంటల నుంచి ఏడు గంటల మధ్య రాత్రి చదివిన అంశాలను తిరిగి మరోసారి కంఠస్తం చేయాలి. ఏడు నుంచి 10 గంటల వరకు కఠినమైన అంశాలను సాధన చేయాల్సి ఉంటుంది. సాధన చేయడంతోపాటు గ్రూపుల్లో చర్చల ద్వారా అందులో పాల్గొనాల్సి ఉంటుంది. 12 గంటల నుంచి రెండు గంటల వరకు భోజన విరామం సమయంలో ఎలాంటి ఆలోచన లేకుండా ముందుకెళ్లాలి. సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాల్సి ఉంటుంది.

సహకార సంఘం సేవలు భేష్

సుల్తానాబాద్: ప్రాథమిక సహకార సంఘంలో రైతులకు అందిస్తున్న సేవలు భేష్‌గా ఉన్నాయని కేరళ సహకార బ్యాంకు ఉపాధ్యక్షుడు కె.కన్నన్ అన్నారు. సోమవారం సుల్తానాబాద్ ప్రాథమిక సహకార సంఘాన్ని సందర్శించారు. దేశంలోనే సహకార రంగంలో అగ్రగామిగా ఉన్న కేరళ రాష్ట్ర సహకార బ్యాంకు ఉపాధ్యక్షుడు కన్నన్‌తో కలిసి సహకార బ్యాంక్ పాలకవర్గ సభ్యులు గగ్రిన్, లాలు, బీపీ పిల్లయి, వీకే ప్రసాద్, కేరళ సహకార బ్యాంక్ డీజీఎంకే టి.నారాయణన్, ఎఫ్ఎం సునీత ఆర్థిక పరిస్థితులు, వ్యాపార సముదాయాలను పరిశీలించారు. రానున్న రోజుల్లో సహకార సంఘం అభివృద్ధి చెందాలని, సంఘాల ద్వారా ప్రతి వ్యాపారం నిర్వహించాలని, సహకార సంఘాలు రైతుల ఆర్థిక పరిపుష్టికి ఎంతో తోడ్పడుతాయని, వ్యవసాయ యంత్రాలు కిరాయికివ్వాలని సూచించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీగిరి శ్రీనివాస్, సహకార రిజిస్టర్ వెంకటేశ్వర్లు, సీఈవో బూర్గు సంతోష్‌కుమార్, సంఘ సిబ్బంది శ్యాంసుందర్, రాజు, నాగరాజు, ప్రవీణ్, సంధ్య, జయంతి, సరిత, రమ దేవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



జీయర్‌స్వామికి స్వాగతం పలుకుతున్న వికాస తరంగిణి భక్తులు

జ్యోతినగర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అహోబిలం జీయర్‌స్వామి అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌కు జీయర్‌స్వామి రాగా.. వికాస తరంగిణి భక్తులు, సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికి శోభాయాత్ర ద్వారా భీముని పట్నంలోని లక్ష్మీ కేశవ ఫంక్షన్ హాల్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి మాట్లాడారు. మానవ కల్యాణానికి శ్రీమద్ భాగవత సప్తాహం ఉపయోగకారిగా నిలుస్తుందని అన్నారు. వారం రోజులపాటు భక్తులకు భాగవత సప్తాహం నిర్వహిస్తామని తెలిపారు. వికాస తరంగిణి సభ్యుడు కొలిపాక శ్రీధర్, సభ్యురాలు దీపిక, సీతా రామాంజనేయస్వామి ఆలయ కమిటీ చెప్యాల రామారావు, కేశవరావు, శ్రీపతిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లు సవరించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలోని పలు ఇళ్లపై విద్యుత్ లైన్లున్నాయని, వాటిని సవరించాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మాధవరావుకు సోమవారం జిల్లా కేంద్రంలో రెండో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేశ్ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చిందన్నారు. ఇళ్లపై అప్పటి అధికారులు ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలు వేయడంతో ఇళ్లపై తీగలున్నాయని, విద్యుత్ షాక్ తగిలి ప్రాణాలు కోల్పోయే అవకాశాలున్నాయని వాపోయారు.

సర్వేను అడ్డుకున్న రైతులు

రామగిరి: మేడిపల్లి శివారులోని భూముల కోసం ఎంజాయిమెంట్ సర్వేకు వెళ్లిన రెవెన్యూ అధికారులను రైతులు సోమవారం అడ్డుకున్నారు. ఆ భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఎంజాయిమెంట్ సర్వేకు క్షేత్రస్థాయిలోకి వెళ్లారు. అయితే తమ భూములను పార్క్ కోసం ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. దీంతో అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం అందించి వెనుదిరిగారు. అనంతరం కలెక్టర్, మంథని ఆర్డీవో కార్యాలయాల్లో రైతులు వినతిపత్రాలు అందజేశారు. కొండ లక్ష్మణ్, శంకర్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, వెంకన్న, సురేశ్, శివకుమార్ పాల్గొన్నారు.

ఎములాడకు బల్దియా సిబ్బంది

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక పారిశుద్ధ్య సిబ్బంది సోమవారం వేములవాడకు తరలివెళ్లారు. మహాశివరాత్రి వేడుకలకు హాజరయ్యే భక్తుల సేవలో వారు పాలుపంచుకుంటారు. శానిటేషన్ పర్యవేక్షకుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 25 మంది సిబ్బంది ఒక ట్రాక్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఈనెల 28 వరకు వేములవాడ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తారు.

గోదావరిఖని: జనగామ శివాలయంలో ఈనెల 26న మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ జనగామ నారాయణ, అర్చకుడు రుద్రభట్ల రమేశ్‌శర్మ తెలిపారు.

యోగా పోటీల్లో ప్రతిభ

యైటింక్లయిన్‌కాలనీ: అల్లూరు ప్రభుత్వ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్న అక్షయ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈనెల 23న మందమర్రిలో నిర్వహించిన సూర్య నమస్కారాలు పోటీల్లో ద్వితీయ, యోగాసన పోటీల్లో తృతీయ స్థానం సాధించింది. కప్‌తోపాటు బహుమతులు అందజేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు

గోదావరిఖని: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఎం నాయకుడు భూపాల్ తెలిపారు.

బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని టీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పోకల నాగయ్య కోరారు.

మాదిగ లాయర్లంతా కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు మాదిగ మిత్రమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటగిరి పాపయ్య తెలిపారు.

జ్యోతినగర్: నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లోని ఏపీ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రులతో సమావేశమయ్యారు.



జ్యోతినగర్: అదమరిస్తే అంతే అన్నట్లుగా ఉంది ఇక్కడి పరిస్థితి. నాలుగు నెలల నుంచి ఎన్టీపీసీ రామగుండం సింధూర కళాశాల రోడ్డులో ఉన్న శ్రీమయి గ్యాస్ గోడౌన్ ముందు గల సీసీ రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఇదే గుంతలో ఓ ఇసుక ట్రాక్టర్ పడిపోయింది. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు కల్వర్టుపై ఏర్పడిన గుంతను పూడ్చి ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఉద్యోగులతో మమేకమై పని చేయాలి

గోదావరిఖని: ఉద్యోగులతో మమేకమై పని చేయాలని ఆర్జీ–2 జీఎం వెంకటయ్య డిప్యూటీ మేనేజర్లకు సూచించారు. డిప్యూటీ మేనేజర్ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన పలువురు అండర్ మేనేజర్లను ఆయన సోమవారం కలుసుకున్నారు. స్థానిక నిమ్‌లో వారికి నిర్వహించిన శిక్షణ తరగతులకు జీఎం హాజరై మాట్లాడారు. వారంపాటు సింగరేణి సంస్థలోని వివిధ అంశాలపై ఉత్తీర్ణులైన వారికి శిక్షణ ఇస్తామని జీఎం తెలిపారు. శిక్షణ ద్వారా ప్రతిభ, సామర్థ్యం, పనిసంస్కృతిని పెరుగుతుందని, ఈ దిశగా అభ్యర్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా 38 మందికి ఇచ్చే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాముడు, డీజీఎం (నిమ్) హుస్సేనీ, నాగరాజు, జియాలజిస్ట్ ఫాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మధుమేహంపై అప్రమత్తంగా ఉండాలని ఆర్జీ–2 జీఎం వెంకటయ్య సూచించారు. సెక్టార్–3 డిస్పెన్సరీలో హెచ్‌బీఏ–1సీ షుగర్ నిర్ధారణపరీక్ష యంత్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏఐటీయూసీ నాయకుడు జిగురు రవీందర్, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్, అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ నర్సింహులు, వకీల్, ఎస్‌ఓటూ జీఎం రాముడు, ఇన్‌చార్జి ఏజెంట్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగినులను వేధిస్తే చర్యలు

గోదావరిఖని: మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ హెచ్చరించారు. తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల రక్షణ, భద్రత కోసం 2013 లైంగిక వేధింపు చట్టం ఏర్పాటు చేశారన్నారు. దీనిపై గనులు, డిపార్ట్‌మెంట్లలో అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం(పర్సనల్) కిరణ్‌బాబు, అధికారుల సంఘం అధ్యక్షుడు మల్లేశం, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

'ఓటమి భయంతోనే సమావేశాలు'



మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

సుల్తానాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి హెలిక్యాప్టర్ పర్యటనలో బ్రీఫ్ కేసులు తీసుకొచ్చి నాయకుల ద్వారా ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పులి ప్రసన్న హరికృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లో బీసీ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఓటమి భయంతోనే సమావేశాలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. తనను ఎమ్మెల్సీగా గెలిపించిన తర్వాత రాష్ట్రంలోని నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. మాజీ సర్పంచ్ పడాల అజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకురాలు తెలంగాణ విట్టల్, కీర్తిలతాగౌడ్, కోట రవిగౌడ్, ఓయూ జేఏసీ నాయకులు మహిపాల్‌యాదవ్, బోయిని రంజిత్, మొలుగూరి అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

ఎలిగేడు: ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం నిర్వహించాయి. రాష్ట్ర యూత్ నాయకుడు దుగ్యాల సంతోష్‌రావు, ఎలిగేడు మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు బాలుసాని పరశురాములుగౌడ్, కొండ తిరుపతిగౌడ్, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు బూర్ల వెంకటసత్యం, అమ్ముల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయ ఉద్యోగులు మద్దతు తెలుపుతున్నారని, ప్రతి ఒక్క ఓటును నరేందర్‌రెడ్డికి వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అన్నారు. పెగడపల్లి, మొట్లపల్లి, కాల్వశ్రీరాంపూర్, గంగారం గ్రామాల్లో ఉపాధ్యాయులు, బ్యాంక్ ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజులైన సదయ్య, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, నాయకులు సతీశ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైనందున ఓట్లడిగే హక్కు లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. సోమవారం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులను కలిసి బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మద్దతు తెలపాలని కోరారు. అల్లాపూర్ శ్రీనివాస్, గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి, కూకట్ల నాగరాజు, కదారి అశోక్‌రావు, కొమ్ము తిరుపతి, తిరుపతి, సదయ్యగౌడ్, గుడ్ల వెంకటేశ్, పవన్, కోట నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మంథని: ఉమ్మడి కరీంనగర్–ఆదిలాబాద్–మెదక్–నిజామాబాద్ పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎన్నికల కన్వీనర్ అలజపూర్ శ్రీనివాస్, బీజేపీ మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి కోరారు.

ఎఫ్ఏ మార్కుల పరిశీలన పూర్తి

- పదోతరగతి విద్యార్థులు 7,393 మంది



సుల్తానాబాద్‌లో విద్యార్థుల రికార్డులను పరిశీలిస్తున్న ఎఫ్ఏ కమిటీ సభ్యులు

సుల్తానాబాద్: పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో 20 మార్కుల వరకు ఫార్మెటివ్ అసెస్మెంట్ ద్వారా కలిపే అవకాశం ఉంది. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లలో విద్యార్థుల రికార్డులను ఎఫ్ఏ టీం సభ్యులు పరిశీలించారు. ఎఫ్ఏ మార్కులు కలపడం చివరి సంవత్సరం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం వంద మార్కులకు పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 35 టీంలు పని చేస్తున్నాయి. 2014–15 అకాడమిక్ ఇయర్ నుంచి ప్రారంభమైన అంతర్గత మార్కులు 2024తో ముగిశాయి. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అంతర్గత మార్కులు అత్యధికంగా వేయడంతో.. ప్రభుత్వ విద్యార్థులకు నష్టం జరుగుతుందనే ఆలోచనతో ప్రభుత్వం ఈ ఆలోచన చేసింది.

గడువు లోపు పూర్తి చేయాలి

పదోతరగతి విద్యార్థుల ఫార్మెటివ్ అసెస్మెంట్ మార్కుల పరిశీలన శనివారంతో ముగియనుంది. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం నియామకం చేసిన కమిటీ సభ్యులు విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పంపించనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్‌తోపాటు వివిధ శాఖల పరిధిలోని ఉన్నత పాఠశాలలను సందర్శించి అందుకు సంబంధించిన పేపర్లను తనిఖీ చేశారు.


జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఉన్నత పాఠశాలల్లో టీం సభ్యులు తనిఖీ చేసి నివేదికను ఎంఈవో ద్వారా జిల్లా విద్యాధికారికి పంపించారు.

ఈనెల 21 నుంచి 28 వరకు హెచ్‌ఎంలు ఎఫ్ఏలో వచ్చిన మార్కులు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ఎస్ఎస్‌సీ బోర్డుకు ఆన్‌లైన్ ద్వారా పంపించాల్సి ఉంటుంది. 72 ప్రైవేట్, 135 కేజీబీవీలు, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్లు, రెసిడెన్షియల్‌తోపాటు ప్రభుత్వ హైస్కూళ్లున్నాయి. 7,393 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు.

విద్యార్థుల భవితకు ఎంతో కీలకం

అంతర్గత మార్కులు విద్యార్థుల భవితకు ఎంతో కీలకంగా మారనున్నాయి. వీటి కేటాయింపులో అవకతవకలకు చోటు లేకుండా మండలస్థాయి బృందాలతో తనిఖీలు చేయించారు. రాత పరీక్షల్లో 80 మార్కులకు గాను విద్యార్థులు సాధించినవి, 20 అంతర్గత మార్కులను కలిపి వార్షిక పరీక్షల తుది ఫలితాలు ప్రకటించనున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు నిబంధనలు పాటించకుండా ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవడానికి అంతర్గత మార్కులు అధికంగా నమోదు చేసే అవకాశాలున్నాయని క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఎఫ్ఏ పరీక్షల మార్కులతోపాటు విద్యార్థులు రాసిన సమాధాన పత్రాల మూల్యాంకనాన్ని పరిశీలించారు.


హెచ్‌ఎంలకు అందజేయాలి



ప్రభుత్వ హైస్కూళ్లలో గడువు లోపు ఎఫ్ఏ టీం సభ్యులు పూర్తి చేసి హెచ్‌ఎంలకు అందజేయాలి. ఈనెల 21 నుంచి 28 లోపు పూర్తి చేయాల్సి ఉంది. ఎంఈవోల ద్వారా డీఈవో కార్యాలయానికి చేరుతాయి. విద్యార్థికి వచ్చిన మార్కులతోపాటు వీటిని యాడ్ చేసి ఫలితాలు ప్రకటిస్తారు.

– మాధవి, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి

అన్ని సక్రమంగా ఉంటేనే..



ప్రభుత్వ, ప్రయివేట్ స్కూళ్లలో పదోతరగతి చదివే విద్యార్థుల రికార్డులు చూడడంతోపాటు వారి దస్తూరిని పరిగణనలోకి తీసుకొని మార్కులను కేటాయిస్తారు. ఈనెల 8 నుంచి 15 వరకు పూర్తి చేశాం. హెచ్‌ఎంలు ఆన్‌లైన్ చేసి ఎంఈవో లాగిన్‌కు పంపిస్తారు. అన్ని సక్రమంగా ఉండి పరిశీలించిన అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారికి పంపిస్తాం.

– ఆరెపల్లి రాజయ్య, ఎంఈవో, సుల్తానాబాద్